

12. భాగవతుల కృష్ణప్రభువు (1823-1876)

రామడుగు శివరామదీక్షితులు (1690–1791) అచలమతం, అచలయోగం పేరుతో ఒక విశిష్టమైన ఆధ్యాత్మిక మార్గాన్ని నిర్దేశించినారు. వారి శిష్యప్రశిష్యులు ఆ నూతనమార్గాన్ని సామాన్యప్రజలవరకు అందించినారు. ఈ నూతన మార్గాన్ని బహుధా వ్యాఖ్యానించిన మహానుభావుడు కొలనుపాక భాగవతుల కృష్ణప్రభువు. ఈ ఇరువురు మహాపురుషులు నల్లగొండ మండలం వారే. ఇరువురూ తెలగాణ్య వైదికులే. రామడుగు వారిది హరితసగోత్రం. భాగవతులవారిది భారద్వాజస గోత్రం. నల్లగొండ మండలంలో కొలనుపాక ప్రసిద్ధక్షేత్రం. శాసనాలలో కొలనుపాక, కొల్లిపాక, కొల్లిపురం నామాంతరాలున్నవి. ఇది హైదరాబాదు కాజీపేట రైలుమార్గంలో ఆలేరు రైల్వేస్టేషనుకు 5 మైళ్ళ దూరానగల చారిత్రకప్రదేశం. ఇక్కడ వాతాపి, కల్యాణి, చాళుక్య కాకతీయుల కాలపు శాసనాలున్నవి. ఇక్కడ శైవ వైష్ణవ జైనబౌద్ధ మతాలు వర్ధిల్లినవి. ఇక్కడి జైన తీర్థంకరుల మందిరం యావద్భారత ప్రశస్తినందుకున్నది. ఇక్కడ పారమార జగద్దేవుడు నిర్మించిన వీరనారాయణమందిరం ప్రశస్తమైనది. రావూరి సంజీవరాయకవి విరచిత వీరనారాయణశతకం గుసుగుసీసాలు తెలుగుసాహిత్యంలో ప్రత్యేకతను సంతరించు

కున్నవి. ఇక్కడి సోమేశ్వరలింగంపై వేయి చిన్నచిన్న లింగాలున్నవి. ఇక్కడి అష్టాదశ మఠాలు భైరవస్వామి నాగుల ప్రతిమలు చారిత్రికప్రసిద్ధి గాంచినవి.

ఇట్టి గ్రామంలో భాగవతుల అనే సార్థకమైన ఇంటిపేరుగల తెలగాణ్యవైదికులు హరికథలు చెప్తూ, భాగవతాలాడుతూ, భక్తిప్రచారం చేసిన పుణ్యాత్ముడు నారాయణ యోగి. ఆయన భార్య జానకి ఆ ఇరువురు ఆదర్శదంపతులు. నారాయణయోగి ప్రతిదినం భగవత్సంకీర్తనం చేస్తూ వీథులవెంట తిరుగుతూ కొన్ని యిండ్లముందు మాత్రమే నిలిచి భిక్ష స్వీకరించేవాడు, అట్లా భిక్షించి తెచ్చిన పదార్థాలతో వంటచేసి భగవంతునికి నైవేద్యం పెట్టి ఒకరికో ఇద్దరికో ఆతిథ్యమిచ్చి తాము తినే ఆ దంపతుల నైష్ఠిక జీవనం అందరి ప్రశంసలకు పాత్రమైనది. ఈ దంపతులకు ఐదుగురు కొడుకులు పుట్టినారు. అందులో పెద్దవాడు కృష్ణయ్య. కృష్ణయ్యను బాల్యంలో తల్లిదండ్రులు గారాబంగా పెంచి అన్నప్రాశనచౌలోపనయనాదివిధ్యుక్తకర్మలాచరించినారు. కృష్ణయ్య చిన్నప్పటినుండి యే చదువు సంధ్యలయందు శ్రద్ధాళువై వలసిన విద్యలు గడించినాడు, తాతతండ్రులవలె కృష్ణయ్యకు భాగవతకథలు హరికథలు, చాలా ఇష్టం. యుక్తవయసులో కృష్ణయ్యకు సమీప బంధువుల అమ్మాయి లక్ష్మీదేవితో పెండ్లైనది. కాని కొలది కాలానికే లక్ష్మీదేవి పరమపదించినది. లక్ష్మీదేవి సోదరులు, బంధువులు కృష్ణయ్య గుణగణాలు మెచ్చి లక్ష్మీదేవి చెల్లెలు అనంతినిచ్చి పెండ్లి చేసినారు. కృష్ణయ్య అనంతి దంపతులకు ఒక కొడుకు ఇద్దరు కూతుళ్ళు కలిగినారు. కృష్ణయ్య హరికథలు చెప్తూతూ, భాగవతాలు ప్రదర్శిస్తూ ఇల్లుగడిపేవాడు.

కృష్ణయ్య భద్రాచలం శ్రీ సీతాలక్ష్మణసమేతరామచంద్రమూర్తిని ఆరాధించేవాడు. ఆయన సహజకవి కనుక రామచంద్రునిపై అనేకకీర్తనలు రచించి కాలికి గజ్జెలు కట్టుకొని పాడుతూ ఆడుతూ హరికథాకాలక్షేపం చేసేవాడు. ఆయన ఆటపాటలకు భక్తులు తన్మయులయ్యేవారు. ఒకనాడు స్వగృహంలోనే కృష్ణయ్య శ్రీరామచంద్రసంకీర్తనం చేస్తుంటే బయట అలికిడైనది. అనంతి బయటికి పోయి చూచినది. ఎవరో సాధువులు

వారియింటికి వస్తున్నారు. భార్యాభర్తలెదురేగి అర్ఘ్యపాద్యములు, ఆతిథ్యము ఇచ్చి సపర్యలు చేసినారు. కుశల ప్రశ్నల తరువాత ఆ దంపతులు సాధువులను ఎటునుండి ఎటు పోతున్నారంటే వారు మీకు రామతారకమంత్రముపదేశించటానికి భద్రాచలంనుండి వచ్చినామన్నారు. కృష్ణయ్య పరమసంతోషంతో తన భాగ్యాన్ని కొనియాడుతూ ఆశువుగా శ్రీరామచరిత్ర సంకీర్తనం చేసినాడు. సాధువులు కృష్ణయ్యతో నీవు శ్రీరామచంద్రునిపై వ్రాసిన కీర్తనలు అధ్యాత్మలు ఆ రామచంద్రుడు వింటాడట. నీవు భద్రాచలానికి రావలసింది అని ఆహ్వానించినారు. కృష్ణయ్య భార్యను తల్లిదండ్రులను మరికొందరు భక్తులను భద్రాచలానికి బయలుదేర దీసినాడు. కొన్నిదినాల ప్రయాణం తరువాత భక్తులంతా భద్రాచలం చేరినారు. భద్రగిరీశుని తనివిదీరా కొలిచినారు. అక్కడ కృష్ణయ్య కొన్ని భాగవత ప్రదర్శనలిచ్చి హరికథలు చెప్పినాడు. నోరారా శ్రీరామచంద్రుని కీర్తించి తిరుగుప్రయాణమై అందరితో కలిసి కొలనుపాక చేరినాడు.

ఇట్లుండగా కొంతకాలానికి కృష్ణదాసు తల్లిదండ్రులు సోదరులు భార్య కొడుకు బిడ్డలు ఒక్కొరొక్కరే అందరూ చనిపోయినారు. కృష్ణదాసు విరక్తుడైనాడు. చిరుతలు తాంబూర ధరించి కాలికి గజ్జెలు కట్టుకొని శ్రీరామనామసంకీర్తనం చేస్తూ ఒంటరిగా పయనమై కొన్నిదినాల తరువాత భద్రాచలం చేరినాడు. గోదావరిలో స్నానంచేసి రామచంద్రుని సన్నిధిలో తన విషాదజీవితగాథ సంకీర్తనం చేస్తూ వెక్కివెక్కి ఏడుస్తుండగా అక్కడికి శ్రీరామచంద్రదర్శనార్థమై వచ్చిన ముత్తైదువుల గుంపులో బుచ్చి వెంకమ్మ అనే జ్ఞాని కృష్ణదాసును పలుకరించినది. ఆయన విషాదగాథ విని ఓదార్చి వేదాంతబోధ చేసి సద్గురువుల నాశ్రయించి ముక్తిమార్గం వెతుక్కొమ్మన్నది. కృష్ణదాసు ఆమె చల్లని ఓదార్పుమాటలు విని ఆమె చేసిన బోధకు ముచ్చటపడి ఆమెకు పాదాభివందనం చేసినాడు. సద్గురువుల జాడలడిగినాడు. కృష్ణదాసుతో ఆయమ్మ నీవు తిరిగిపోయే టప్పుడు పల్నాటిసీమలో (ప్రస్తుతం ఒంగోలుజిల్లా) ఎల్లగొండపాలెం అనే గ్రామ మున్నది. అక్కడ అచల గురుసార్వభౌములు రామదుగు శివరామదీక్షితుల ప్రశిష్యుడు, కంబాలూరి అప్పమంత్రి శిష్యుడు, ఐన పరశురామ సీతారామస్వాములవారు

(1782-1854) ఉన్నారు. వారి నాశ్రయించి వారి అనుగ్రహానికి పాత్రుడవై ఈ సంసారాన్ని తరించుమని దీవించి పోయినది.

కృష్ణదాసు మరునాడుదయం స్నానసంధ్యలు ముగించి సీతారామచంద్రులను సేవించి, సన్నిధిలో సంకీర్తనం చేసి తీర్థప్రసాదాలందుకొని తిరుగుపయనమైనాడు. రామనామ సంకీర్తనం చేస్తూ ఎల్లగొండపాలెం చేరి పరశురామ సీతారామస్వామి గారి వాకిట నిలిచి బుచ్చివెంకమ్మగారు చెప్పినప్రకారం శ్రీవారి గురు పరంపరాస్తోత్రం చేసినాడు. తనగురువు స్తోత్రం విని సీతారామస్వామి వాకిట్లోకి వచ్చి కృష్ణదాసును ఆర్ద్రంగా చూచినాడు. ఇంతలో బుచ్చివెంకమ్మ లోపలినుండి వచ్చి స్వామివారికి కృష్ణదాసు దీనగాథ చెప్పినది. తనకు భద్రాచలంలో హితోపదేశం చేసిన బుచ్చి వెంకమ్మగారే గురుపత్ని అని తెలిసిన కృష్ణదాసు ఆ దంపతులపాదాలపై వ్రాలినాడు. తన కరుణార్ద్రగాథ మరల గురువులకు నివేదించినాడు. సీతారామస్వామి మనసు కరగినది. ఆయన కృష్ణదాసుతో ఈ రాత్రికి గురుపూజ జరుగుతుంది. త్రికరణశుద్ధిగా నీ తనుమనధనములు గుర్వర్పణం చేయగలిగితే ఈ రాత్రే నీకు గురుదీక్ష లభిస్తుంది. జననమరణాలు తొలగద్రోసే పరిపూర్ణబోధ చేస్తాను అన్నారు.

కృష్ణదాసు పరమానందంతో మరల ఒకసారి గురుదంపతులకు సాగిలపడి ఎల్లగొండపాలెం వీథుల్లోనికి పోయినాడు. గురుపూజకోసం నూతనవస్త్రాలు యజ్ఞోపవీతం పండ్లు పూలు పత్రి కొబ్బరికాయ ఆకులు వక్కలు అగరువత్తులు చిల్లర డబ్బులు మొదలైన పూజాసామగ్రి సంపాదించుకొని గురుపూజామంటపం చేరినాడు. అక్కడ సీతారామస్వామి సోదరుడు పరశురామవెంకటనరసింహదాసు లఘుపూజావిధి నిర్వహిస్తున్నారు. కృష్ణదాసు తన తనుమనధనములు ధారబోసి గురువులను సేవించి పూజించినాడు. గురువుగారు కృష్ణదాసు ఫాలభాగం పంచామృతంతో తడిపి అరచేతితో ఆతని కండ్లు తుడిచి నాల్కపై బీజాక్షరం దిద్ది కుడిచెవిలో ద్వాదశి షోడశి పంచదశి మంత్రాలు చెప్పి ఆతని చేత ఉచ్చరింపచేసినాడు. హస్తమస్తకసంయోగం చేసి వీపు

రెండు కందార్థములుగా రచించి ఇచ్చినాడు. శేషమాంబ కోరికమేరకు మరొక కందార్థం రచించి ఇచ్చినాడు. హృదయం నిండా గురుభక్తి నింపుకొన్న కృష్ణదాసుకు గురుదంపతులు సోదరీసోదరులు ప్రేమతో సెలవిచ్చినారు. "ఎఱుకకు వెరువకు. గురువాక్యం మరువకు" అంటూ సీతారామస్వామి కృష్ణదాసును చివరిసారిగా ఆశీర్వదించి సాగనంపినారు.

కృష్ణదాసు కొలనుపాక చేరి గురుబోధలు గానం చేస్తూ వీథులు తిరిగి భిక్షిస్తూ ఏకాంత వాసం చేస్తుండేవాడు. ఆతని బావమరదులు వచ్చి మరల పెండ్లి చేసుకొమ్మని ప్రార్థించినా కృష్ణదాసు వినలేదు. కోవూరు కృష్ణదాసనే షావుకారుచేత చెప్పించినారు. ఆయన ఎవరు చెప్పినా వినలేదు. వారు కృష్ణదాసు పాడే గురుబోధలను, కృష్ణదాసు ప్రవర్తనను ఎగతాళి చేయటం ప్రారంభించినారు. వారి పోరు పడలేక కృష్ణదాసు స్వగ్రామం విడిచి రాజధాని హైదరాబాదు నగరం చేరినాడు. నగరంలో మహారాజ్ గంజ్‌లో ఒక దేవాలయంలో నివసిస్తూ వీథులు తిరిగి వేదాంత తత్త్వగానాలు చేస్తూ హరికథలు చెప్పుతూ కాలం గడిపేవాడు. కృష్ణదాసు దేవాలయంలో నామసంకీర్తనం తత్త్వకీర్తనం చేస్తుంటే అక్కడికి వచ్చే భక్తులు తన్మయులై వినేవారు. తోచిన దక్షిణ సమర్పించి పోయేవారు. ఒకనాడక్కడికి వచ్చిన స్త్రీలలో జాలమాంబ అనే బ్రాహ్మణవనిత కృష్ణదాసు భక్తిసంగీతాన్ని విన్నది. ఆమె బాల్యంలోనే వితంతువైనందున భక్తిజ్ఞాన వైరాగ్యములు అలవరచుకొని భగవత్సేవలో జీవితం ధన్యం చేసుకుంటూ గడుపుతున్నది. తోడి మహిళలతో కలిసి ఆమె కృష్ణదాసుగారి పుట్టుపూర్వములడిగినది. ఆయన తన విషాదగాథ తల్లిదండ్రులు ఇరువురు, భార్యలు ఇద్దరు తమ్ములు, ఇద్దరు చెల్లెండ్రు, ఒక కొడుకు, ఇద్దరు బిడ్డలు నాలుగేండ్లలో పరమపదించిన వృత్తాంతం చెప్పినాడు. జాలమాంబ కృష్ణదాసుగారు గొప్పజ్ఞాని భక్తుడని గ్రహించి పాదాలపైబ్రాలి తనను కడతేర్చవలసిందిగా ప్రార్థించినది. కృష్ణదాసు ఆమెను తమ పెద్దల అనుమతి తీసుకొని రమ్మన్నారు. జాలమాంబ తన తల్లిదండ్రులను తోడ్కొని వచ్చి కృష్ణదేశికులకు పరిచయం చేసినది. కూతురు మనసెరిగిన తల్లిదండ్రులు కృష్ణదేశికుని తమ యింటనే ఉండవలసిందని ప్రార్థించి తోడ్కొని పోయినారు. కృష్ణదేశికులు జాలమాంబ ఇంట్లో

శంకరప్రభువులు కార్యదర్శి, కృష్ణప్రభువులు అధ్యక్షులు. అధ్యక్షభాషణంలో కృష్ణ ప్రభువులు అచలమతంలో గురువుల ప్రాధాన్యం, ఆసంప్రదాయంలోని వైశిష్ట్యం చెప్పినారు. ఇతరమతాలవారి ఉపన్యాసాలు విన్నారు. చిట్టచివరన తమ అధ్యక్షోపన్యాసం చేసినారు. ఈ విధంగా భాగవతుల కృష్ణ ప్రభువు అచలమతం ప్రచారకుల్లో ముఖ్యులుగా ఎందరికో జ్ఞానభిక్ష పెట్టినారు.

శా.శ.౧౭౯౮ ధాతనామ సం॥ కార్తీక శుద్ధ దశమి శుక్రవారం 27-10-1876 నాడు కృష్ణప్రభువులు ద్వైతాద్వైత రహిత పరమ పదవిచెంది అశరీరులైనారు. వారిని బేగంపేటలో సమాధి చేసినారు. బేగంపేట విమానాశ్రయం నిర్మాణమప్పుడు వారి సమాధితోపాటు వారి శిష్యుల సమాధులు కూడా చెదరిపోయినవి.

ఆధారం :

1. శ్రీమద్భాగవత శ్రీకృష్ణ దేశికేంద్రులవారి దివ్య చరిత్రము- భూమానంద వప్పంగి రామారావు, 1901.
2. శ్రీలక్ష్మణ దేశిక ప్రభువు, అచలగురుమందిరం, అధ్యక్షులు, ఉప్పలంచి కృష్ణమూర్తి గారందించిన సమాచారం.